నిర్మల్ అర్బన్: చిన్నారికి పోలియో చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ అర్బన్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్ టౌన్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న చైర్మన్ సత్యం

నిండు జీవితానికి రెండు చుక్కలు

- జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ
- ఆయా చోట్ల ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నిర్మల్ అర్బన్/ఖానాపూర్/ఖానాపూర్ టౌన్/ఖానాపూర్ రూరల్/సారంగాపూర్/మామడ/దిలావర్‌పూర్/దస్తురాబాద్/భైంసా/భైంసా టౌన్/ ముధోల్, తానూర్/కుంటాల/కుభీర్/సోన్/లక్ష్మణచాంద:, మార్చి 3: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమెల్యే మహేశ్వర్ రెడ్డి కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏడాది నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి దన్ రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, భూపాలః రెడ్డి, సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక భాగ్యనగర్ కాలనీలో చిన్నారులకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పోలియో చుక్కలు వేశారు. ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్, గాంధీనగర్, రాజీవ్‌నగర్, సుభాష్ నగర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోశ్, కౌన్సిలర్లు కిశోర్‌నాయక్, తొంటి శ్రీనివాస్, నాయకులు శంకర్, షబ్బీర్ పాషా, రాజేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంతో పాటు జామ్, కౌట్ల(బి), ఆలూర్, ధని, చించోలి(బి), బోరిగాం, స్వర్ణ, బీరవెల్లి, మల్లక్‌చించోలి తదితర గ్రామాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పోలియో చుక్కులు వేశారు. డాక్టర్ వేదవ్యాస్, హెల్త్‌సూపర్‌వైజర్ కృష్ణమోహన్ గౌడ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. మామడ, దిలావర్‌పూర్ మండలాల్లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో గోవర్ధన్, దిలావర్‌పూర్ పీహెచ్‌సీ వైద్యుడు శ్యామ్‌కుమార్, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఖానాపూర్ మండలంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగరపు శ్రావణ్, పాదం రాజేశ్వర్, కరిపె రాజ్‌కుమార్, ధర్మరాజు, నవీన్, ఏఎన్ఏం గంగామణి, దస్తురాబాద్ మండలంలో ఎంపీపీ సింగరి కిషన్, డాక్టర్ శివకుమార్, వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, ఇన్‌చార్జి డాక్టర్ చందన, హెచ్‌తావో వేణుగోపాల్, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెంబిలో చిన్నారులకు ఎంపీపీ భుక్యా కవిత పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి అనిల్, నాయకులు స్వప్నిల్ రెడ్డి, భుక్యా గోవింద్, మతిన్, అంగన్‌వాడీ టీచర్లు విశ్వరూప, సుశీల, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. భైంసా పట్టణంలోని ఏరియా దవాఖానలో చిన్నారులకు ఎమ్మెల్యే రామారావు పటేల్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డా. కాశీనాథ్, డా. అనిల్, కౌన్సిలర్ తోట విజయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బీజేపీ నాయకులు మల్లేశ్, రావుల పోశెట్టి, బాలాజీ సూత్రావే, దత్తు, సుదర్శన్, వడ్నం శ్రీనివాస్, ఫేరోజ్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కమల జిన్నింగ్ మిల్లులో చిన్నారులకు మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ పోలియో చుక్కలు వేశారు. ఆయన వెంట నాయకులు దేవిదాస్, శంకర్ చంద్రే, తదితరులున్నారు. భైంసా మండల వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. కుంటాల పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎండీ రహీం ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ తేజస్విని, లింబా (కే) ఎంపీటీసీ సునంద-గిరీష్, ఓలా మాజీ సర్పంచ్ ఖనీష్ ఫాతిమా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, హెల్త్ అసిస్టెంట్లు ఎన్‌వీ ప్రసాద్, జ్యోతి-వసంత్, కిషన్ ప్రసాద్, ఏఎన్ఎం సుక్కుబాయి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే, ముధోల్, తానూర్, కుభీర్, సోన్, లక్ష్మణచాంద మండలాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ముధోల్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుభీర్: మండల కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ అల్కాతాయి చౌహాన్

దస్తురాబాద్ : మండల కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సింగరి కిషన్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న డాక్టర్ శ్యామ్‌కుమార్

ఇంటర్ మూల్యాంకన కేంద్రం ప్రారంభం

సరస్వతీ మాత చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న నోడల్ అధికారి పరశురాం, తదితరులు

నిర్మల్ అర్బన్, మార్చి 3: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని జిల్లా నోడల్ అధికారి పరశురాం ప్రారంభించారు. సరస్వతీ మాతకు పూజలు చేశారు. స్పెల్ వన్‌లో భాగంగా సోమవారం పేపర్ల మూల్యాంకనం చేస్తారని తెలిపారు. అధ్యాపకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కుమ్మరి సంఘం కార్యవర్గం

కడెం, మార్చి 3: మండలంలోని ఎలగడపలో కుమ్మరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కట్కనపెల్లి భూమేశ్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి శంకర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో సన్మానించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కరపత్రం ఆవిష్కరణ

భైంసా, మార్చి 3: భైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సమస్యలపై ఈనెల 10న నిర్వహించే సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఆలిండియా ఎస్సీ పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, డివిజన్ అధ్యక్షుడు సట్వాజీ సాంగే, దళిత సంఘాల నాయకులు భీంరావు డొంగ్రే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గౌర శ్రీనివాస్, ప్రకాశ్, అనంత్ రావు, సంతోష్ పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల విభాగం

సారంగాపూర్, మార్చి 3: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దిలావర్‌పూర్, మార్చి 3: మండలంలోని స్వర్ణ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఆర్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

హ్యుమన్ రైట్స్ చైర్మన్‌గా సాయికుమార్

ఖానాపూర్, మార్చి 3: పట్టణానికి చెందిన తోట సాయికుమార్ హ్యుమన్ రైట్స్ నియోజకవర్గ చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యుమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర చైర్మన్ నోముల సంపత్‌గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు.

కొనసాగుతున్న సప్తాహ

ముధోల్, మార్చి 3: మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సప్తాహ కొనసాగుతున్నది. భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తక రూపంలో ఉద్యమకారుల చరిత్ర

కుభీర్, మార్చి 3: తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను పుస్తక రూపంలో తీసుకొస్తున్న సందర్భంగా ఆదివారం మండలంలోని పల్సి గ్రామంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణాగౌడ్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నాయకుల వివరాలను సేకరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కొట్టె హన్మాండ్లు, హేమ్లే రమేశ్, హన్మాండ్లు, మోనాజీ లక్ష్మణ్, అబ్బాయి గజ్జారాం, దేవేందర్, కొట్టె గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 3: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పని చేస్తున్న అటెండర్ తురాటి ముత్తన్న(55) గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ శివాజి కాలనీలో నివాసముంటున్న ముత్తన్నకు ఆదివారం ఇంటి వద్ద ఛాతిలో నొప్పి రావడంతో కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు చూసి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ముత్తన్నకు భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు

దస్తురాబాద్, మార్చి 3: మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. కాగా, గ్రామాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

బుట్టాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

మహిళను పరీక్షిస్తున్న వైద్యుడు

దస్తురాబాద్, మార్చి 3: మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో జగిత్యాలకు చెందిన శ్వేత దవాఖాన అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రాహుల్ గ్రామానికి చెందిన 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న పలువురిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఏరియా దవాఖానకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, నాయకులు రమేశ్, నవీన్‌రావు, లక్ష్మీ రాజం, ప్రజ్యోత్, గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సర్వే

భైంసాటౌన్, మార్చి 3: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో గల ఆకార్ ఆశ దవాఖాన సిబ్బంది కామోల్, దేగాం, తిమ్మాపూర్, మహగాం గ్రామాల్లో ఆదివారం శరీర పునర్నిర్మాణ అవసరం గల వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ, ఆకార్ ఆశ దవాఖానలో పుట్టకతో వచ్చే శరీర లోపాలు, ప్రమాదాలతో సంభవించిన శరీర భాగాల లోపాలను శస్త్ర చికిత్సతో పాటు ప్లాస్టిక్ సర్జరీ చేస్తామని తెలిపారు. నాలుగు గ్రామాల్లో ఇప్పటి వరకు 100కు పైగా కేసులను గుర్తించామన్నారు. అందరికీ ఉచితంగా చికిత్స చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శుభశ్రీ, నివేదిత, పారిజాతం, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, మార్చి 3: జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 6, 7, 8వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారి సంతోష్ తెలిపారు. 2618 మంది విద్యార్థులకు గానూ 2423 మంది హాజరు కాగా, 195 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కుంటాల, మార్చి 3: మండలంలోని లింబా (కే) గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ అప్పగజ్జారాం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సునంద-గిరీశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్ రహీం, అడ్వకేట్ నరేశ్, దేవేందర్ రెడ్డి, దత్తు పటేల్, సాయన్న, మల్లారెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్, మార్చి 3: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న ప్రారంభించారు. బీజేపీ మండల ఇన్‌చార్జి తాటివార్ రమేశ్, నాయకులు దశరథ్, గంగయ్య, బంటు, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కడెం: విద్యుత్ బిల్లు రసీదు ఇస్తున్న ఏఈ సుమన్‌కుమార్

కుంటాల, మార్చి 3: గృహజ్యోతి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గజ్జారాం సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన పథకాన్ని ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రహీం, ఏఈ శివప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రాజ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, జక్కుల గజేందర్, జేఎల్ఎంలు హఫీస్, సతీశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కడెం, మార్చి 3: వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏఈ సుమన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ బిల్లు రసీదులను అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర మాజీ సీఎంను కలిసిన భైంసా వాసులు

మాజీ సీఎంతో మాట్లాడుతున్న భైంసా వాసులు

భైంసా, మార్చి 3: పట్టణంలోని బభ్రు మహరాజ్ నివాసంలో ఆదివారం మహారాష్ట్ర మాజీ సీఎం, బోకర్ ఎమ్మెల్యే అశోక్ చౌహాన్‌ను భైంసా వాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్-భైంసా జాతీయ రహదారిని కుభీర్, ఇస్లాపూర్ వరకు పొడగించి బాసర-మహోర్ ఆధ్యాత్మిక కారిడార్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో డా. దామోదర్ రెడ్డి, డా. రామకృష్ణగౌడ్, డా. ముత్యం రెడ్డి, డా. మనోజ్, బభ్రు మహరాజ్ తదితరులున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

సోన్, మార్చి 3: నిర్మల్ మండలం రత్నాపూర్‌కాండ్లీ గ్రామంలో నిర్మించిన రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న భక్తులు

అంగన్‌వాడీల్లో సదుపాయాలు కల్పించాలి

నిర్మల్ టౌన్, మార్చి 3: అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలను కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నిర్మల్‌లో ఆదివారం ఆయన అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీల్లో పారదర్శకత కోసం సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. సమావేశంలో అంగన్‌వాడీల సంఘం నాయకులు రాజమణి, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

సోన్, మార్చి 3: నిర్మల్ మండలం చిట్యాల్ సమీపంలోని సంతానవర గోవింద స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బహుమతుల ప్రదానం

సోన్, మార్చి 3: నిర్మల్ మండలం రత్నాపూర్‌కాండ్లీ గ్రామంలో వాల వాకింగ్ అండ్ లాఫింగ్ 9వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వాలా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు నాలం శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

పాల్‌టెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

ఉట్నూర్, మార్చి 3: విద్యార్థులు పాల్‌టెక్నిక్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా త్వరగా ఉపాధి పొందే అవకాశాలు ఏర్పాడతాయని ఉట్నూర్ పాల్‌టెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి మురళీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పాల్‌టెక్నిక్ విద్య, దాని ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఇందులో 24 రకాల ఇంజినీరింగ్ కోర్సులు ఉంటుందన్నారు. ఈ కోర్సులు నేర్చుకొని జీవితంలో త్వరగా స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది గజానంద్, లింగేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

బోథ్, మార్చి 3 : పొచ్చెర గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మోర నవీన్‌రెడ్డికి స్నేహితులు ఘన స్వాగతం పలికారు. 21 ఏళ్ల పాటు ఆర్మీలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన అనంతరం మొదటి సారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా 1997-98 సంవత్సరం ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్వాగతం పలికారు. శనివారం రాత్రి ఓపెన్ టాప్ జీపులో గ్రామానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అనంతరం పాత గ్రామ పంచాయతీ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించారు. దేశం కోసం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మ, నాయకులు

లక్ష్మణచాంద, మార్చి 3: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఎంపీపీ అడ్వాల పద్మ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, నాయకులు అడ్వాల రమేశ్, చెవ్వ రాజేశ్వర్, దశగౌడ్, అల్లూరి రాజు, గోవర్ధన్, కంకల రవి, సబ్బని నర్సయ్య, నరేశ్, నాగేశ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ

ఖానాపూర్, మార్చి 4: 2023 మార్చి వరకు గల ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టీ మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద కల్పిస్తున ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు ప్రాధాన్యమివ్వాలి

భైంసా, మార్చి 3: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు ప్రాధాన్యమివ్వాలని అఖిల భారత ధోబీ మహా సమాజ్ జాతీయ అధ్యక్షుడు బాలాజీ కోరారు. పట్టణంలో ఆదివారం ఆయన రజక సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ సుంకెట పోశెట్టితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వాషర్ మెన్ ఫెడ్‌రేషన్ చైర్మన్, పాలకమండలిని నియమించాలని, రజకులకు రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రజక సంఘం నాయకులు మహేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి, మార్చి 3 : ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని అడవుల్లో వన్యప్రాణులను వేటాడేందుకు ఎవరైనా ఉచ్చు బిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడవుల్లో చెట్లను నరికిన, అక్రమంగా కలపను దొంగలించిన, అటవీకి నిప్పంటించి ధ్వంసం చేసిన తెలంగాణ అటవీ చట్టం 1967, వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తామని తెలిపారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఉట్నూర్, మార్చి 3: గిరిజన ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగోన్నతులు కల్పించాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ భవనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరల్ డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించనందున, ఏజెన్సీ డీఎస్సీని నిర్వహించిన గిరిజన యువతతో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఇతర జిల్లాలో 317 జీవోతో ఇబ్బందులు పడుతున్నారని ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేడు ఆదిలాబాద్‌కు రానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా కార్యదర్శి రాథోడ్ గజేందర్, ఉట్నూర్ మండలాధ్యక్షుడు జాదవ్ పవన్‌లాల్, ప్రధాన కార్యదర్శి పవార్ శేర్‌సింగ్, గౌరవాధ్యక్షుడు ఇందల్‌సింగ్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవానికి ఆహ్వానం

తాంసి, మార్చి 3 : పొన్నారి గ్రామంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించే అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రథమ వార్షికోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని పలు సమస్యలు విన్నవించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.